సాక్షి
పార్వతీపురం మన్యం
బుధవారం । 4 । జనవరి । 2023





**జాతి వైరం మరచి...**

చిత్రంలో కనిపిస్తున్న పంది జాతివైరం మరచి అమ్మ తనం చాటుకుంది. తన పిల్లలతోపాటు కుక్క పిల్లకు పాలిచ్చింది. వంగర మండలం పటువర్ధనం గ్రామంలో మంగళవారం కనిపించిన ఈ దృశ్యాన్ని స్థానికులు ఆశ్చర్యంగా తిలకించారు. – వంగర

**హరిలో రంగ హరి..!**



పల్లెల్లో సంక్రాంతి శోభ ప్రారంభమైంది తెలతెల వారక ముందే హరిలో రంగ హరి..గోవిందా హరి.. అంటూ హరిదాసుల సంకీర్తన ప్రారంభమైంది.

- 8లో

**నేడు ఎన్నికలరోల్ అబ్జర్వర్ రాక**

పార్వతీపురం: ఎన్నికలరోల్ అబ్జర్వర్ ఎ.బాబు జిల్లాలో బుధవారం పర్యటించనున్నారని కలెక్టర్ నిషాంత్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోల్ అబ్జర్వర్ మధ్యాహ్నం చేరుకుంటారని, భోజన విరామం అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ఓటరు నమోదు అధికారులు, సహాయ ఓటరు నమోదు అధికారులతో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు.

## న్యూస్‌రీల్

### అందుబాటులో పాస్‌పోర్టు సెల్



పాస్‌పోర్టు సెల్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

పార్వతీపురంటౌన్: జిల్లాలో ఏర్పాటుచేసిన పాస్‌పోర్టు సెల్‌ను యువత సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు పిలుపునిచ్చారు. జిల్లా స్పెషల్ బ్రాంచ్ కార్యాలయంలో నూతనంగా పాస్‌పోర్టు సెల్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ కొత్త ఏడాది నుంచి పాస్‌పోర్టు వెరిఫికేషన్ ఇక్కడే జరుగుతుందన్నారు. పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకున్నవారు కేంద్రం సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఒ.దిలీప్‌కిరణ్, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు, జిల్లా స్పెషల్ బ్రాంచ్, జిల్లా పాస్‌పోర్టు సెల్ ఇన్‌చార్జి ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### నూతన సంవత్సర శుభాకాంక్షలు



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎస్పీ, ఏఎస్పీ

పార్వతీపురం: కలెక్టర్ నిషాంత్‌కుమార్‌ను కలెక్టర్ కార్యాలయంలో పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, అడిషనల్ ఎస్పీ దిలీప్‌కిరణ్ మంగళవారం కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

### 6న ఏఆర్‌టీ వైద్యాధికారి పోస్టుకు ఇంటర్వ్యూ

విజయనగరం ఫోర్ట్: పార్వతీపురం ఏఆర్‌టీ కేంద్రం వైద్యాధికారి పోస్టుకు ఈ నెల 6వ తేదీన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాయంలో ఉదయం 10:30 గంటలకు ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్టు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.వి. రమణకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూకు వచ్చే అభ్యర్థులు ఒరిజనల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు. ఎంబీబీఎస్ ఉత్తీర్ణులై, ఏపీ మెడికల్ కౌన్సిల్‌లో పేరు నమోదుచేసుకున్న వారు అర్హులుగా పేర్కొన్నారు.

### స్వాతికి సావిత్రిబాయిపూలే ఎక్సలెన్స్ అవార్డు



తమిళనాడు గవర్నర్ తమిళసై చేతుల మీదుగా అవార్డు తీసుకుంటున్న మహిళా సంరక్షణ కార్యదర్శి స్వాతి

పూసపాటిరేగ: మండలంలోని కుమిలి సచివాలయ మహిళా సంరక్షణకార్యదర్శి పడాల స్వాతికి సావిత్రిబాయిపూలే ఎక్సలెన్స్ అవార్డు వరించింది. తిరుపతిలో సావిత్రిబాయిపూలే జయంతి సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తమిళనాడు గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. మహిళా సంరక్షణ కార్యదర్శిగా అందించిన సేవలకు గాను అవార్డు వచ్చింది. ఆమెను ఎంపీడీఓ జి.రామారావు, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, వైస్ సర్పంచ్ సురేష్‌రెడ్డి అభినందించారు.

### సైక్లింగ్ క్రీడాకారుడికి అభినందనలు



సైక్లింగ్ క్రీడాకారుడిని అభినందిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీల్లో పాల్గొని కాంస్య పతకం సాధించిన దమరసింగి గణేష్‌ను ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మంగళవారం తన నివాసం వద్ద అభినందించారు. గరివిడి మండలంలోని తోండ్రంగి గ్రామానికి చెందిన గణేష్ ఎస్‌డీఎస్ అటానమస్ కళాశాలలో తృతీయ సంవత్సరం బీఏ చదువుతున్నాడు. ఇటీవల గుంటూరులో జరిగిన సైక్లింగ్ రేసులో విజయనగరం జిల్లా తరఫున తలపడి కాంస్య పతకం సాధించాడు. ఈ నెల 7 నుంచి 10వ తేదీవరకు మహారాష్ట్రలో జరిగే జాతీయస్థాయి సైక్లింగ్ పోటీలకు అర్హత సాధించాడు.

# అర్హులందరికీ పింఛన్లు



లబ్ధిదారుకు కొత్త పింఛన్ అందిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

- కలెక్టర్ నిషాంత్‌కుమార్
- జిల్లాలో పింఛన్ వారోత్సవాలు ప్రారంభం
- అర్హులకు కొత్త పింఛన్లు అందజేసిన అధికారులు

పార్వతీపురం: ప్రభుత్వం అర్హులందరికీ పింఛన్లు అందజేస్తోందని కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి రాజమహేంద్రవరంలో పింఛన్ వారోత్సవాలను మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో పార్వతీపురం గిరిమిత్ర సమావేశ మందిరంలో కలెక్టర్‌తో పాటు డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి తదితరులు తిలకించారు. జిల్లాలో పింఛన్ వారోత్సవాలను ప్రారంభించారు. లబ్ధిదారులకు కొత్త పింఛన్లను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా 5,781 పింఛన్ల మంజూరుతో జిల్లాలో పింఛన్ల సంఖ్య 1,44,476కు చేరుకుందన్నారు. ప్రతి నెలా ప్రభుత్వం పింఛన్ల కోసం రూ.39కోట్లు వెచ్చిస్తోందని చెప్పారు. పేదలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

### సంతోషంగా ఉంది



కూలీనాలి చేసుకుంటూ జీవితం సాగిస్తున్న నాకు కొత్తగా పింఛన్ మంజూరు కావడం సంతోషంగా ఉంది. ఈ పింఛన్ డబ్బులతో నాకు కావాల్సిన మందులు, చిన్నచిన్న అవసరాలు తీరుతాయి. జగనన్న రుణమాఫీ కింద రూ.36వేలు లబ్ధి చేకూరింది. జగనన్న తోడు కింద రూ.10వేలు అందింది. ఇంతకన్నా మాలాంటి కూలిబతుకులకు ఇంకేం కావాలి. జగన్ మోహన్ రెడ్డి రుణం తీర్చుకోలేనిది.

– నాగిరెడ్డి మహాలక్ష్మి, కృష్ణపల్లి, పార్వతీపురం మండలం

### బతుకుదెరువు..



పింఛన్ మంజూరు కావడంతో ఇంట్లోని కుటుంబ సభ్యుల మీద ఆధారపడాల్సిన అవసరం లేదు. నా అవసరాలకు పింఛన్ నగదును వినియోగించుకోవడానికి అవకాశం కలిగింది. వైఎస్సార్ ఆసరా పథకం కింద రూ.7,350లు అందింది. పేదల బాగుకు ప్రభుత్వం కృషిచేస్తోంది.

– పూసర్ల ప్రభ, కృష్ణపల్లి, పార్వతీపురం మండలం

### ముందస్తు సంక్రాంతి



నాకు ఐదుగురు పిల్లలు. ఎవరి బతుకు వారు బతుకుతున్నారు. నన్ను ఎవరూ పట్టించుకోరు. జగన్‌మోహన్ రెడ్డి దయవల్ల పింఛన్ మంజూరు కావడం సంతోషంగా ఉంది. రుణమాఫీ కింద రూ.12వేలు, మా రెండవ పాపకి చేయూత కింద రూ.35వేలు, మనవడికి అమ్మ ఒడి పథకంలో రూ.15వేలు అందాయి. ఈ ఏడాది మాకు ముందుగానే సంక్రాంతి వచ్చింది.

– పి.శ్యామల, పార్వతీపురం

### దివ్యాంగ పింఛన్ మంజూరు



నేను దివ్యాంగుడును. ఒక గేదెను పోషిస్తూ వచ్చే ఆదాయంతో జీవితాన్ని నెట్టుకొస్తున్నాను. ప్రభుత్వం పింఛన్ మంజూరు చేసింది. తనను గుర్తించినందుకు సంతోషంగా ఉంది. అర్హతే కొలమానంగా పథకాలు అందజేస్తోంది.

– సీహెచ్ పార్వతీశం, లక్ష్మీపురం, పార్వతీపురం మండలం

### హాయిగా బతుకుతా...



పింఛన్ మంజూరు కావడంతో ఇక నేను హాయిగా బతుకుతాను. కూలినాలీ చేసుకుంటూ బతికే మాకు పింఛన్ కానుక గొప్ప ఊరటనిచ్చింది. మా ఆవిడకు సున్నా వడ్డీ కింద రూ.2,800 అందాయి. జగనన్న ప్రభుత్వం వచ్చాక మా ఇంటికి రూ.78,250లు ఆర్థిక సాయం అందింది. పేదలను గుర్తిస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– ఎస్.నారాయణ, కృష్ణపల్లి, పార్వతీపురం మండలం

# కార్గోలో కొత్త పుంతలు!



- ప్రైవేటు లాజిస్టిక్స్‌తోనూ ఒప్పందాలు
- సరకు రవాణాలో ఆర్టీసీ జోన్–1 జోరు
- గత ఏడాదికంటే రూ.4.15 కోట్లు పెరిగిన ఆదాయం
- అన్ని ఆదాయ మార్గాలపైనా ఆర్టీసీ అధికారుల దృష్టి
- ఏటీబీ ఏజెంట్ల వ్యవస్థ మరింత విస్తృతం
- కార్గో రవాణా వాహనాల పెంపు

సాక్షి, విశాఖపట్నం: కార్గో రవాణాలో ఆర్టీసీ ఊహించిన దానికంటే ఎక్కువ ఆదాయాన్ని ఆర్జిస్తోంది. ఇప్పటికే తక్కువ సమయంలో సరకులను, పార్శిళ్లను గమ్యానికి చేరుస్తూ వినియోగదారుల ఆదరణ చూరగొంటోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఈ సేవలను మరింతగా విస్తృతం చేసే దిశగా ఆలోచన చేస్తోంది. సరకు రవాణాలో ఆర్టీసీ జోన్–1 (పూర్వ విజయనగరం జోన్) జోరు మీద ఉంది. ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో ఉన్న ఈ జోన్‌లో 47 సరకు రవాణా వాహనాలున్నాయి. వీటిలో 17 కంటెయినర్లు, 30 డీజీటీలు (డిపో గూడ్స్ ట్రాన్స్‌పోర్టు) ఉన్నాయి. ప్రస్తుతం ఇవన్నీ ఒక్క రోజు కూడా ఖాళీ లేకుండా తిరుగుతున్నాయి. ఇలా రోజు రోజుకు పెరుగుతున్న కార్గో రవాణాతో వీటి సంఖ్యను పెంచాలని ఆర్టీసీ అధికారులు యోచిస్తున్నారు. మరోవైపు కొత్తగా ప్రైవేటు లాజిస్టిక్స్ (పార్శిల్) సంస్థలతోనూ ఒప్పందాలు కుదుర్చుకునే దిశగా వీరు అడుగులు వేస్తున్నారు. ఇందుకోసం ఆయా సంస్థలకు అధీకృత ఏజెన్సీలను ఇస్తారు. ఆపై ఆ సంస్థలు బుక్ చేసిన సరకులను గాని, లేదా ఆ సంస్థలు రవాణా చేయగా మిగిలిన సరకులను గాని ఆర్టీసీ ద్వారా కూడా రవాణా చేసేలా చర్చిస్తున్నారు. బుకింగ్ చేసే వారి నుంచి ప్రైవేటు పార్శిల్ సంస్థలు వసూలు చేసే చార్జితో ఆర్టీసీకి సంబంధం ఉండదు. ఆర్టీసీ నిర్దేశిత రవాణా చార్జి చెల్లిస్తే చాలు.. గమ్యానికి చేరవేస్తారు. ప్రైవేటు పార్శిల్ సర్వీసులు సరకును గమ్యానికి చేర్చడానికి 3–4 రోజుల సమయం పడుతుంటే ఆర్టీసీ గరిష్టంగా 24–48 గంటల్లోపే ఆయా ప్రాంతాలకు చేరుస్తుంది. ఇలా ప్రైవేటు పార్శిల్ సంస్థకంటే వేగంగా గమ్యాన్ని చేరుస్తుండడం తమకు కలిసొచ్చే అంశంగా ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు.

**కొరియర్ సేవల్లో దూకుడు**

ఆర్టీసీ కొరియర్ సేవలకు మరింత ఆదరణ లభిస్తోంది. పార్శిల్ కౌంటర్ నుంచి 10 కి.మీల పరిధిలో 50 కిలోల బరువు వరకు సరకు/కొరియర్ పార్శిళ్లను వినియోగదారుడు కోరుకున్న చిరునామాకు డోర్ డెలివరీ చేస్తున్నారు. వీటిలో వివిధ రకాల పార్శిళ్లతో పాటు బ్లడ్ శాంపిల్స్ డెంటల్ కిట్స్ వంటివి కూడా ఉంటున్నాయి. జోన్–1 నుంచి సిమెంట్, వైట్ సిమెంట్, హార్డ్‌వేర్, గృహావసర సరకులు, గోధుమపిండి, దుస్తులు, ఫ్లిప్‌కార్ట్ సరకులు, బిస్కెట్లు, విత్తనాలు, పుస్తకాలు, మందులు, బియ్యం, నూకలు, పాత టైర్లు వంటివి బుక్ అవుతున్నాయి. ఇంకా ఇల్లు మారాలనుకునే వారి సామగ్రి తరలింపును కూడా ఆర్టీసీ చేపట్టింది. ఇలా సరకు రవాణా ద్వారా 35 శాతం, పార్శిళ్ల ద్వారా 65 శాతం ఆదాయాన్ని ఆర్జిస్తోంది.

**ఏటీబీ ఏజెంట్ల సంఖ్య పెంపు**

మరోవైపు ఆర్టీసీ కార్గోకు పెరుగుతున్న ఆదరణతో ఆథరైజ్డ్ టికెట్ బుకింగ్ ఏజెంట్ల (ఏటీబీలు) వ్యవస్థను విస్తరించాలని అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం ఈ జోన్‌లో 60 మందికి పైగా ఏటీబీ ఏజెంట్లు ఉండగా ఆ సంఖ్యను 200 వరకు పెంచనున్నారు. ఈ ఏజెంట్లకు బుకింగ్ చార్జీలో 15 శాతం కమీషన్‌గా చెల్లిస్తారు. ఏటీబీ కోసం గ్రామీణ ప్రాంతంలో రూ.1000, అర్బన్‌లో రూ.5 వేల చొప్పున తిరిగి చెల్లించే పద్ధతిలో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఏటీబీ ఏజెన్సీలతో పాటు ఇంటి సామగ్రి తరలింపు కోసం 7331147260/7331147261/9346749365 నంబర్లకు సంప్రదించాలని ఆర్టీసీ జోనల్ అధికారులు కోరుతున్నారు.

**రూ.4.15 కోట్లు పెరుగుదల**

కార్గో రవాణాలో ఆర్టీసీ జోన్–1 గత ఏడాదికంటే మెరుగైన ఆదాయాన్ని సాధించింది. 2021 ఏప్రిల్ నుంచి డిసెంబర్‌కు ఈ జోన్ రూ.11.37 కోట్లు ఆర్జించగా, 2022 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు రూ.15.52 కోట్లు సంపాదించింది. అంటే గత ఏడాదితో పోల్చుకుంటే రూ.4.15 కోట్ల ఆదాయం పెరిగిందన్న మాట! ఇలా 36 శాతానికి పైగా వృద్ధి కనిపించింది.

### కార్గో వ్యవస్థ మరింత బలోపేతం



ఆర్టీసీ కార్గో రవాణాకు మంచి ఆదరణ లభిస్తోంది. దీంతో ఈ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నాం. ఏటీబీ ఏజెన్సీలను విస్తృతం చేస్తాం. డిమాండ్‌కు అనుగుణంగా డీజీటీలు/కంటైనర్ వాహనాలను పెంచుతాం. డీజిల్ ధరలు గణనీయంగా పెరిగినా 2018లో నిర్దేశించిన రవాణా చార్జీలే వసూలు చేస్తున్నాం. ఈ జోన్‌లో గత ఏడాదితో పోల్చుకుంటే రూ.4.5 కోట్ల కార్గో ఆదాయం పెరిగింది. ప్రైవేటు కార్గో సంస్థలకంటే వేగంగా, సురక్షితంగా సరకులు, పార్శిళ్లను డెలివరీ ఇస్తున్నాం. త్వరలో ప్రైవేటు కార్గో సంస్థలకు ఆథరైజ్డ్ ఏజెన్సీలు ఇచ్చి వారి సరకును కూడా ఆర్టీసీ ద్వారా రవాణా చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

–రవికుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జోన్–1

# విజయనగరంలో కోవిడ్ కేసు నమోదు

- ఆస్ట్రేలియా నుంచి వచ్చిన మహిళకు పాజిటివ్‌గా నిర్ధారణ
- హోమ్ ఐసోలేషన్‌లో ఉన్న మహిళ
- పాజిటివ్ వచ్చిన మహిళది బొండపల్లి మండలం గరుడుబిల్లి

విజయనగరం ఫోర్ట్: విజయనగరం జిల్లాలో కోవిడ్ టెన్షన్ మళ్లీ మొదలైంది. ఫోర్త్ వేవ్‌లో తొలికేసు నమోదైంది. మొదటి, రెండో వేవ్‌ల్లో కోవిడ్ విలయతాండవం సృష్టించింది. ఆ తర్వాత వ్యాక్సినేషన్ జరగడంతో థర్డ్‌వేవ్ వచ్చినా అంతగా ప్రభావం చూపలేదు. కొద్ది నెలలుగా కోవిడ్ కేసులు నమోదు కాలేదు. తాజాగా కేసు నమోదుకావడం చర్చనీయాంశమైంది. బొండపల్లి మండల గరుడుబిల్లి గ్రామానికి చెందిన భార్యభర్తలు ఆస్ట్రేలియా నుంచి ఈ నెల ఒకటో తేదీన వచ్చారు. విశాఖపట్నం ఎయిర్ పోర్టులో భార్యభర్తలిద్దరికీ కోవిడ్ నిర్ధారణ పరీక్షలు చేయగా భార్యకు కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ఆమె భర్తకు నెగిటివ్ అని వచ్చింది. ప్రస్తుతం వారిద్దరు వారి స్వగ్రామంలో హోమ్ ఐసోలేషన్‌లో ఉన్నారు. విజయవాడ ల్యాబ్ నుంచి వచ్చిన తుది వైద్య రిపోర్టు తర్వాత ఏ వేరియంట్ అనేది తెలుస్తోందని డీఎంహెచ్‌ఓ రమణకుమారి తెలిపారు. ప్రస్తుతం వారిద్దరూ ఆరోగ్యంగా ఉన్నారని చెప్పారు. కోవిడ్ కేసు నమోదు కావడంతో జిల్లా వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు.

# యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

- ఉపాధి కోర్సుల శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి
- స్కిల్ ట్రెనింగ్ అండ్ జాబ్‌ఫెయిర్ ప్రభుత్వ సలహాదారు శ్రీధర్‌రెడ్డి



స్కిల్ కళాశాలలో సౌకర్యాలపై ఆరా తీస్తున్న శ్రీధర్‌రెడ్డి, సత్యనారాయణ

విజయనగరం అర్బన్: యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా వివిధ స్వయం ఉపాధి కోర్సుల్లో ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని స్కిల్ ట్రెనింగ్ అండ్ జాబ్ ఫెయిర్ ప్రభుత్వ సలహాదారు గాది శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్, సీడాప్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ ఎస్.సత్యనారాయణతో కలిసి విజయనగరం టీటీడీసీలోని స్కిల్ కళాశాలను మంగళవారం ప్రారంభించారు. ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలోని స్కిల్ హబ్‌లను సందర్శించారు. స్కిల్ కళాశాల, హబ్‌లలో శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో మాట్లాడారు. భోజన, వసతి సౌకర్యాలపై ఆరా తీశారు. శిక్షణ శైలిని పరీక్షించారు. కళాశాల సిబ్బందికి పలు సూచనలిచ్చారు. డీఆర్‌డీఏ–సీడాప్ సంస్థ ఆధ్వర్యంలో టీటీడీసీ మహిళా ప్రాంగణంలో నిర్వహిస్తున్న డీడీయూ–జీకేవై శిక్షణ ద్వారా (ఎస్ఆర్‌టీపీ) రిటైల్ కోర్సులో శిక్షణ పొందుతున్న 35 మంది యువతకు యూనిఫారాలు, శిక్షణకు అవసరమైన వెల్‌కమ్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతలో నైపుణ్యాలు పెంపొందించి ఉపాధి, ఉద్యోగావకాశాలను కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్కిల్ కళాశాలలను ఏర్పాటుచేశారన్నారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా శిక్షణ ఇస్తున్నట్టు వెల్లడించారు. శిక్షణలో సాధించిన నైపుణ్యత ఆధారంగా ఉద్యోగాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో సీడాప్ జేడీఎం డి.మార్టిన్‌లూథర్, ఏపీఎస్ఎస్‌డీసీ–డీఎస్‌డీఓ గోవిందరావు, రెడాక్స్ దుర్గాప్రసాద్, సీడాప్ సిబ్బంది పాల్గొన్నారు.

# 8న గ్రూప్–1 స్క్రీనింగ్ టెస్ట్

- 5,530 మంది అభ్యర్థులకు 13 కేంద్రాల్లో పరీక్ష నిర్వహణ
- కలెక్టర్ సూర్యకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో గ్రూప్–1 స్క్రీనింగ్ టెస్ట్ ఈ నెల 8న నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు. విజయనగరం పట్టణంలోని 13 కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం నిర్వహించనున్న పరీక్షకు 5,530 మంది అభ్యర్థులు హాజరుకానున్నారన్నారు. పరీక్ష ఏర్పాట్లపై సమీక్షించారు. లైజన్ అధికారులందరూ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి వసతులపై నివేదిక ఇవ్వాలన్నారు.

ఈ నెల 6న ఏపీపీఎస్సీ ప్రతినిధుల సమక్షంలో మరో సమావేశం జరగనుందని, అభ్యర్థులకు అవసరమైన సూచనలు వెల్లడిస్తారన్నారు. సమావేశంలో డీఆర్వో ఎం.గణపతిరావు, లైజన్ అధికారులు, కళాశాలల ప్రతినిధులు పేర్కొన్నారు.

# చకచకా ధాన్యం బిల్లుల చెల్లింపు

- జిల్లాలోని రైతుల ఖాతాలకు రూ.88 కోట్ల జమ
- ఇప్పటికే 1.10 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ
- నేడు, రేపు మరో రూ.100 కోట్ల చెల్లింపునకు సన్నాహాలు



లారీలతో ధాన్యం తరలిస్తున్న కాట్రగడ–బి ఆర్‌బీకే సిబ్బంది

భామిని: పార్వతీపురం మన్యం జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు జోరందుకుంది. అదే స్థాయిలో బిల్లుల చెల్లింపు చకచకా సాగుతోంది. వాస్తవంగా ధాన్యం విక్రయించిన రైతు ఖాతాకు 21 రోజుల్లో బిల్లు డబ్బులు జమచేయాలి. ప్రస్తుతం వారం రోజుల్లోనే డబ్బులు జమవుతున్నాయి. మరోవైపు క్వింటాకు గ్రేడ్‌ను బట్టి రూ.2040 నుంచి రూ.2060లు మద్దతు ధర లభిస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

**చెల్లింపులు ఇలా..**

జిల్లాలో గత ఏడాది డిసెంబర్ 30న ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాలకు సుమారు రూ.80 కోట్లను ప్రభుత్వం జమచేసింది. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ ధాన్యం సేకరణ లక్ష్యం 1.90లక్షల మెట్రిక్ టన్నులు కాగా, ఇప్పటికే లక్షా 10వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు జిల్లా అధికారులు చెబుతున్నారు. నేడు, రేపో మరో రూ.100 కోట్లమేర ధాన్యం కొనుగోలు మొత్తాన్ని రైతుల ఖాతాలకు జమచేసేందుకు జిల్లా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఆర్‌బీకేల్లో ధాన్యం విక్రయించిన రైతులకు గోనె సంచులు, రవాణా ఖర్చులు, బస్తాల ఎత్తిదింపుడు కూలి సొమ్మును చెల్లించడంపై రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

### మద్దతు ధర చెల్లింపు

ఆర్‌బీకేలలో ధాన్యం విక్రయించిన రైతులకు మద్దతు ధర చెల్లిస్తున్నాం. వారం రోజుల్లోనే నగదును వారి ఖాతాలకు జమచేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే లక్షా 10వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తయింది. రైతుల ఖాతాల్లోకి 80 కోట్ల మేర జమచేశాం. రెండో విడతగా రూ.100 కోట్లు విడుదల కాగానే రైతుల ధాన్యం సొమ్ము జమచేస్తాం.

– డి.దేవుళ్లనాయక్, సివిల్‌సప్లయి డీఎమ్, పార్వతీపురం మన్యం జిల్లా

### వారంలోనే ధాన్యం డబ్బులు



ఆర్‌బీకేల ద్వారా ధాన్యం అమ్మకాలు చేసిన వారం రోజుల్లోనే నా బ్యాంకు ఖాతాకు ప్రభుత్వం రూ.77,027లు జమచేసింది. గత ఏడాది డిసెంబర్ 22న ధాన్యం విక్రయించాను. 30వ తేదీ నాటికి ఖాతాలోకి గిట్టుబాటు ధర మొత్తం జమయింది.

– జగుశెట్టి గణేష్, యువరైతు, నేరడి–బి, భామిని మండలం

### ఎలాంటి ఇబ్బంది లేకుండా..



ప్రభుత్వం చేపట్టిన నూతన ధాన్య సేకరణ విధానం రైతుకు ప్రయోజనకరం. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర నేరుగా మా ఖాతాలోకి వచ్చి చేరాయి. నేను ధాన్యం విక్రయించిన 8 రోజులకే ధాన్యం డబ్బులు రూ.1,32,000 జమయ్యాయి.

– పాతపట్నం లక్ష్మణరావు, రైతు, గురండి

# రైతుల ఖాతాలకు సకాలంలో డబ్బులు

- కలెక్టర్ నిషాంత్‌కుమార్




సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: ఖరీఫ్ వరి ధాన్యం సేకరణ త్వరగా పూర్తిచేసి రైతుల ఖాతాలకు సకాలంలో డబ్బులు వేస్తున్నట్టు కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం సేకరణపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో నిర్లక్ష్యం వహించకూడదని అధికారులకు సూచించారు. జిల్లాలో ధాన్యం సేకరణ సుమారు 60 శాతం పూర్తయిందన్నారు. రెవెన్యూ, వ్యవసాయ, పౌర సరఫరాల అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. రబీ పంట ఇ–క్రాప్ బుకింగ్ పూర్తిచేయాలని, పీఎం కిసాన్ పథకానికి ఈకేవైసీ చేయించాలన్నారు. రైతులకు కావలసిన ఎరువులు, పురుగుమందులు సిద్ధం చేయాలన్నారు. జీడిమామిడి పంటకు నష్టం జరిగితే ఇన్సూరెన్స్ వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎండీ నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్, జిల్లా ఉద్యాన అధికారి కె.వి.ఎస్.ఎన్ రెడ్డి, జిల్లా మత్స్య శాఖ అధికారి వి.తిరుపతయ్య, జిల్లా పౌర సరఫరాల అధికారి కె.వి.ఎల్.ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### పైడితల్లికి పుష్పాలంకరణ


పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారిని మంగళవారం పుష్పాలతో అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఏడిద రమణ, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్‌లు అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజాదికాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రీతికరమైన తీపి పదార్థాలను నివేదన చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు,కుంకుమలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప,రావి చెట్ల వద్ద దీపారాధన చేశారు. ఆలయ ఈఓ కిశోర్ కుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

### ఎంపీ 'బెల్లాన' ఇంట్లో శత చండీయాగం


శతచండీ యాగంలో ఎంపీ బెల్లానతో పాటు కుటుంబసభ్యులు

చీపురుపల్లి: ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ నివాసంలో శతచండీ యాగ మహోత్సవం మంగళవారం వైభవోపేతంగా ప్రారంభమైంది. ఐదు రోజుల పాటు జరగనున్న శతచండీ యాగంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, సతీమణి శ్రీదేవి, కుమారుడు వంశీకృష్ణ, పావని దంపతులు పాల్గొన్నారు. ఈ నెల 7వ తేదీ వరకు శతచండీ యాగం జరుగుతుందని పండితులు తెలిపారు.

### ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో ఖాళీస్థలాలకు టెండర్లు

విజయనగరం టౌన్: విజయనగరం, గజపతినగరం, బొబ్బిలి, చీపురుపల్లి బస్‌స్టేషన్ పరిసరాల్లో ఉన్న ఖాళీస్థలాలు/షాపులకు అద్దె ప్రాతిపదికన కేటాయించేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు విజయనగరం డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి 9వ తేదీ మధ్యాహ్నం 12 గంటల వరకూ ఆయా డిపోల్లో టెండర్ ఫామ్స్ పొందవచ్చన్నారు. వివరాలకు ఆయా డిపోమేనేజర్‌లను సంప్రదించాలని సూచించారు.

### బైక్ అదుపు తప్పి యువకుడి మృతి

లక్కవరపుకోట: తెలంగాణ రాష్ట్రం నుంచి వచ్చిన కొంతమంది యువకులు అరకు అందాలు చూసేందుకు వెళ్తుండగా ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని సూర్యాపేటకు చెందిన ఎం.విఘ్నేష్(26) స్నేహితులతో కలిసి ఈ నెల 1వ తేదీన విశాఖపట్నం చేరుకుని అక్కడ అద్దెకు ద్విచక్రవాహనాలు తీసుకుని అరకు బయల్దేరారు. ఎల్.కోట పాత జంక్షన్ సమీపంలో రోడ్డుపైనగల గుంతను తప్పించబోయి ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో విఘ్నేష్ కిందపడి తీవ్ర గాయాల పాలవడంతో స్నేహితులు విజయనగరం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# హరిలో రంగ హరి..!

- గ్రామాల్లో మొదలైన హరిదాసుల సందడి
- సంతరించుకున్న సంక్రాంతి శోభ..

కురుపాం/పార్వతీపురం: పల్లెల్లో సంక్రాంతి శోభ ప్రారంభమైంది తెలతెలవారక ముందే హరిలో రంగ హరి..గోవిందా హరి.. అంటూ హరిదాసుల సంకీర్తన ప్రారంభమైంది. ప్రాచీన సంస్కృతి సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తాయి పల్లెలు. పల్లెల్లో సంస్కృతి సంప్రదాయాలు సంక్రాంతి నెల రోజుల్లో ప్రతిబింబిస్తాయి. సంక్రాంతి పండగ ఆగమనాన్ని గుర్తుచేస్తూ తలపై అక్షయ పాత్ర, మెడలో నిలువెత్తు దండ, పట్టు పీతాంబరాలు ధరించి..ఒక చేతిలో చిడతలు..మరోచేతిలో తంబుర .. నుదుటన నామాలు ..కాళ్లకు గజ్జెలు..విష్ణు నామ స్మరణతో కంచు కంఠంతో సంక్రాంతి నెల రోజులూ పల్లెల్లో ఇళ్ల ముంగిట హరిదాసులు దర్శనమిస్తారు. ఈ నెల రోజులు వారు ఎవరి ఇంటి ముంగిటా ఎక్కువ సేపు నిలవరు. కానుకలు సమర్పించినా సమర్పించక పోయినా గోవిందా హరి అంటూ ముందుకు సాగిపోతారు. తెల్లవారుజామున సాగే వారి ప్రయాణం సూర్యుడు నడినెత్తి మీదికి వచ్చే వరకూ సాగుతుంది. ఈ సందర్భంగా సీతమ్మకు చేయిస్తి చింతాకు పతకం రామచంద్రా..అంటూ భద్రాద్రి రామదాసు కీర్తనలు రాగయుక్తంగా ఆలపిస్తారు.

**అక్షయ పాత్ర చాలా ముఖ్యం**

హరిదాసుల అక్షయ పాత్ర చాలా ముఖ్యమైంది. తెల్లవారుజామున పాత్రను తలపై పెట్టుకుని గ్రామ సంచారం పూర్తయిన దానిని తలపై నుంచి దించాలని సంవత్సరాలుగా హరిదాసు వృత్తిలో ఉన్న వారు చెబుతున్నారు. ధనుర్మాసం నెల రోజులూ సూర్యోదయానికి ముందు శ్రీకృష్ణ, గోదాదేవిలకు నివేదన చేసి, తిరుప్పావై పఠించి అక్షయపాత్రను ధరిస్తారు. గ్రామసంచారం ప్రారంభమైన దగ్గర నుంచి అక్షయ పాత్ర దించడం కానీ, మాట్లాడడం కాని చేయరాదు. అధ్యాత్మిక, రామాయణ కీర్తనలు, కృష్ణ లీలలను గానం చేస్తూ సంక్రాంతి శోభ పల్లెలకు విస్తరిస్తామని హరిదాసులు వివరిస్తున్నారు.


కురుపాం: గ్రామాల్లో కీర్తనలు ఆలపిస్తున్న హరిదాసు

### అక్షయపాత్ర చరిత్ర

శ్రీ మహావిష్ణువు సూర్య భగవానుడికి అందించిన అక్షయపాత్రను వనవాస సమయంలో శ్రీకృష్ణుడు ధర్మరాజుకు ఇచ్చాడని పురాణాలు చెబుతున్నాయి. ధర్మరాజు పట్టాభిషేకం అనంతరం ఈ పాత్రను ఎవరికైనా ఇవ్వడం ఎలా? అన్న ధర్మరాజు సందేహాన్ని నివృత్తి చేస్తూ శ్రీకృష్ణుడు సలహా చెప్పాడు . ఒక మంటపానికి వేయి గంటలు కట్టించి, విప్రోత్తములందరినీ పిలిచి అన్న సమారాధన చేయాలి. ఆ సమయంలో ఏకకాలంలో వేయి గంటలు మోగాలని ధర్మరాజుకు శ్రీకృష్ణుడు చెప్పాడు. శ్రీకృష్ణుడు చెప్పిన విధంగా ధర్మరాజు చేసినప్పటికీ వేయి గంటలు ఒకేసారి మోగకపోవడంతో కృష్ణుడిని మళ్లీ ప్రార్థించాడు. కృష్ణుడు అప్పుడు ఓ వైష్ణవుడిని పిలిచి భోజనం చేయమని అర్థించగా స్వయం పాకం కోరాడు. ఆ వైష్ణవుడు స్వయంగా వండి, వార్చి, గోదాదేవి సహిత శ్రీకృష్ణమూర్తికి నివేదన చేసిన తరువాత భుజించగా ఆ వేయి గంటలు మోగినట్లు పురాణాల ద్వారా తెలుస్తోంది. దీంతో ధర్మరాజు అక్షయపాత్రను వైష్ణవుడికి ఇవ్వగా అప్పటి నుంచి ఆ పాత్రను ధనుర్మాసంలో తలపై ధరించి విష్ణునామ సంకీర్తనలతో గ్రామ సంచారం చేసే వృత్తి తమకు సంక్రమించిందని హరిదాసు పిరిడి సింహాచలం తెలిపారు.

# ఘనంగా ప్రారంభమైన పెద్ద పోలమాంబ అనుపోత్సవం


అమ్మవారి ఘటాలు తలపై పెట్టుకుని ఊరేగించేందుకు సిద్ధమైన భక్తులు

మక్కువ: ఉత్తరాంధ్ర ఇలవేల్పు, భక్తుల ఆరాధ్య దైవం శంబరపోలమాంబ అమ్మవారు మేనత్త పెద పోలమాంబ అమ్మవారి ఉత్సవం (పెద్ద పండగ) మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. గతనెల 29తేదీన గ్రామం శివారులో ఉన్న పెద్దఅమ్మవారిని గ్రామంలోని చదురుగుడిలోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. తొమ్మిదిరోజుల పాటు ఆలయంలో అమ్మవారి ఘటాలు పూజలందుకోగా మంగళవారం సాయంత్రం ఘటాలను బాజాభజంత్రీలు, మేళతాళాల నడుమ, ఊరేగించారు. రాత్రంతా గ్రామంలోని అన్ని పురవీధుల్లో అమ్మవారి ఘటాలను ఊరేగించగా, భక్తులు ఘటాలకు పూజలు చేశారు. రహదారిపై ఉంచిన నూతనవస్త్రాలపై చిన్న పిల్లలను పడుకోబెట్టగా అమ్మవారు ఘటాలు పట్టుకున్న భక్తులు చిన్నపిల్లలను దాటుకుంటూ వెళ్లారు. దీనివల్ల చీడపీడల బారినుంచి చిన్నపిల్లలు తప్పించుకోవచ్చని భక్తుల విశ్వాసం. ముందుగా గ్రామానికి చెందిన గిరడవారి, నాయుడువారి (పూడి), కర్ణాలు (కుప్పిలి)వారి ఇళ్ల వద్ద తొలి పూజ(ఉత్సవం) జరిపి అనంతరం మంగళవారం రాత్రంతా అమ్మవారి ఘటాలతో తిరువీధి కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం ఉదయం గ్రామంలోని ప్రధానరహదారి వద్ద అమ్మవారికి ఉయ్యాల కంబాలు నిర్వహించి, ఘటాలకు అనుపోత్సవం చేస్తారు.


అమ్మవారి ఘటాలు

**నేడు చాటింపు**

ఈ నెల 23,24,25తేదీల్లో నిర్వహించనున్న శంబర పోలమాంబ అమ్మవారి జాతరలో భాగంగా అమ్మవారిని గ్రామంలోకి తీసుకుని వచ్చేందుకు బుధవారం చాటింపు వేస్తారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వి.రాధాకృష్ణ, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పూడి దాలినాయుడు, కమిటీసభ్యులు, మాజీ ట్రస్ట్‌బోర్డుచైర్మన్లు, గ్రామపెద్దలు, దేవాదాయశాఖ సిబ్బంది, గ్రామస్తులు, భక్తులు పాల్గొంటారు.

# 5, 6 తేదీల్లో అండర్-19 స్కూల్ గేమ్స్ జట్ల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్-19 స్కూల్ గేమ్స్ క్రీడా పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 5,6 తేదీల్లో నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి పీవీ ఎల్ఎన్ కృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5న ఉదయం 9 గంటలకు విజ్జి స్టేడియంలో బాస్కెట్‌బాల్ పోటీలు, 6న ఉదయం 9 గంటల నుంచి ఎంఆర్ స్టేడియంలో క్రికెట్ క్రీడాకారుల ఎంపిక పోటీలు జరగనున్నట్లు చెప్పారు.

ఈ ఎంపిక పోటీ ల్లో ప్రస్తుతం ఇంటర్మీడియట్ విద్యనభ్యసిస్తూ 19 సంవత్సరాలలోపు వయస్సు గల బాల, బాలికలు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో అర్హత సాధించిన క్రీడాకారులు త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని, అర్హత ఆసక్తి గల క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని సూచించారు.

# రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు పక్కాగా అమలు చేయండి

- కలెక్టర్ ఎ.సూర్యకుమారి

బొండపల్లి: జిల్లాలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి వాటి నివారణకు గాను తీసుకుంటున్న చర్యలను పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి వివిధ శాఖలు అధికారులను ఆదేశించారు. మండలంలోని గొట్లాం గాయత్రి కాలేజ్ సమీపంలో గల బ్లాక్ స్పాట్‌ను మంగళవారం వివిధ శాఖల అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ స్పీడ్ గన్‌ను ఏర్పాటు చేయగా పరిశీలించారు.బ్లాక్ స్పాట్ వద్ద ఏర్పాటు చేసిన రంబెల్ స్ట్రిప్స్‌తో పాటు వేగనిరోధకాలు సరిపోవని మరిన్ని ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాలను నివారించడానికి అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. వాటితో పాటు ఇదే ప్రాంతంలో స్పీడ్ గన్‌లు ఏర్పాటు చేసి వేగంగా వెళ్తున్న వాహనాలను గుర్తించి వాహనాల యజమానులకు జరిమానాలు విధించాలని సూచించారు. అలాగే తర,చూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల వద్ద హెచ్చరికగా ప్రమదాలకు గురైన వాహనాల ఫొటోలను ప్రదర్శనలో ఉంచాలని చెప్పారు.జాతీయ రహదారితో పాటు ,ప్రధాన రహదారులపై ఏర్పాటు చేసే ఫ్లెక్సీలు, హోర్డింగులు రోడ్డు మార్జిన్‌లోకి రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.


గొట్లాం వద్ద జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్‌ను పరిశీలించి అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

**వేగ నియంత్రణపై దృష్టి**

డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ మాట్లాడుతూ జిల్లాలో గొట్లాం, బొండపల్లి, కింతలపాలెం, పూల్ బాగ్, సారిపల్లి,అచ్యుతాపురం, గుర్ల, గరివిడి ప్రాంతాల్లో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. వివిధ శాఖల సంయుక్త తనిఖీల్లో పది బ్లాక్ స్పాట్‌లను గుర్తించామని చెప్పారు.ఇలాంటి చోట్ల స్పీడ్ బ్రేకర్లు, లాడ్వా,రంబెల్ స్ట్రిప్స్, ట్రాఫిక్ సేఫ్టీ కోన్స్ ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పాఠశాలలు, ఇతర రద్దీగా ఉండే ప్రాంతాలను గుర్తించి వేగనియంత్రణపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఈఈ జీవీ రమణ, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎ.వి.రమణ, రవి శంకర్ ప్రసాద్, ఐఆర్‌ఏడీ జిల్లా మేనేజర్ ఎం.శ్రీధర్, ఎన్.హెచ్ డీఈఈ నర్సింగరావు, ఏఈ సురేష్,తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, ఎంపీడీఓ ఎ.వేదవతి తదితరులు పాల్గొన్నారు.

# టెన్నికాయిట్ జిల్లాస్థాయి క్రీడాకారుల ఎంపిక


టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

పూసపాటిరేగ: మండలంలోని కొప్పెర్ల బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో జిల్లాస్థాయి టెన్నికాయిట్ క్రీడాకారుల ఎంపిక మంగళవారం జరిగింది. జిల్లాస్థాయిలో ఎంపికైన అండర్-19 క్రీడాకారులు ఈనెల 11,12 తేదీలలో ఏలూరులో జరగబోయే రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొంటారు. సబ్‌జూనియర్స్‌లో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 11,12 తేదీల్లో అనకాపల్లిలో జరగబోయే పోటీలలో పాల్గొంటారు. ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు, పీఈటీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ ఎంపికలు జరిగాయి.

# రైతుల ఆర్థిక అవసరాలు తీరేలా రుణప్రణాళికలు

- బ్యాంకర్లతో జేసీ సమీక్ష


జేసీ మయూర్ అశోక్


పాల్గొన్న బ్యాంక్ అధికారులు, జిల్లా అధికారులు

విజయనగరం అర్బన్: సామాన్య ప్రజలు, రైతుల ఆర్థిక అవసరాలను తీర్చే విధంగా రుణ ప్రణాళికలు రూపొందించాలని జేసీ కే.మయూర్ అశోక్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం ఆయన బ్యాంకర్లతో సమీక్ష నిర్వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు రూపొందించాలని ఈ సందర్భంగా అధికారులు, బ్యాంకుల ప్రతినిధులను కోరారు. జిల్లా స్థాయి టెక్నికల్ కమిటీ సభ్యులందరూ హాజరై వివిధ ప్రాజెక్టులకు అందించే రుణాల గురించి, సంబంధిత ప్రతిపాదనలపై జేసీకి వివరించారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎ.శ్రీనివాసరావు, డీసీసీబీ సీఈఓ కె.జనార్దన, డీజీఎం వాసు, వ్యవసాయ, మత్స్య, పశుసంవర్ధక శాఖల అధికారులు, ఇతర విభాగాల జిల్లా స్థాయి అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కుమ్మరిగుంటలో కదలని గజరాజులు

కొమరాడ: గడిచిన నెలరోజులుగా కుమ్మరిగుంట, కంబవలస పంచాయతీ ప్రజలకు ఏడు గజరాజుల గుంపు కంటిమీద కునులేకుండా చేస్తోంది. మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు అర్తాం రిజర్వ్ ఫారెస్ట్‌లో సంచిస్తున్న గజరాజుల గుంపు సోమినాయుడువలస గేటునుంచి రాజ్యలక్ష్మీపురం వెళ్లే రహదారిపై తచ్చాడుతున్నాయి. దీంతో ఆ రహదారిపై ప్రయాణం చేయడానికి ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. అలాగే గంగరేగువలస, కుమ్మరిగుంటలో ప్రధాన పంటలైన టమాటో, చెరకు, అరటి, తదితర పంటలను ధ్వంసం చేయడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గజరాజులను ఈ ప్రాంతం నుంచి తరలించేలా అటవీశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


సుందరపురంలో సంచరిస్తున్న గజరాజుల గుంపు

# రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు గొట్లాం విద్యార్థులు

బొండపల్లి: రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు గొట్లాం ఉన్నత పాఠశాలలో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు అర్హత సాధించినట్లు హెచ్.ఎం, శ్రీరామాచారి, పీడీ యు.సత్యానంద్‌లు మంగళవారం తెలిపారు. పాఠశాలలో చదువుతున్న ఐ.దుర్గ, కె.పావని, బి.హరిలు ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచినట్లు చెప్పారు. వారు త్వరలో అనంతపురంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరపున పాల్గొననున్నట్లు చెప్పారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

### కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

| | |
|---|---|
| విశాఖపట్నం | రూ. 547.00 |
| విజయనగరం | రూ. 547.00 |
| శ్రీకాకుళం | రూ. 551.00 |

### బులియన్

| విశాఖపట్నం | |
|---|---|
| బంగారం(24సి. 10గ్రా.) | 54,930-00 |
| బంగారం(22సి. 10గ్రా.) | 50,350-00 |
| వెండి (కిలో) | 74,500-00 |

### చికెన్

బ్రాయిలర్

| లైవ్ | డ్రెస్డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|
| ₹120 | ₹210 | ₹ 220 |





# బైక్ ఢీకొని ఉపాధ్యాయుడికి గాయాలు


చికిత్స పొందుతున్న సింహాచలం


చరణ్‌తేజ

పార్వతీపురం: మండలంలోని వెంకంపేట పంచాయతీ, వసుంధరానగర్‌కు చెందిన తోయక సింహాచలం గుంజరాడ యూపీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయన పాఠశాల విధులను ముగించుకుని ఆటోలో ఇంటికి వస్తూ రహదారి దాటుతున్న సమయంలో నర్సిపురం నుంచి పార్వతీపురం వస్తున్న ద్విచక్రవాహనం బలంగా ఢీకొట్టడంతో రోడ్డుపై తుళ్లిపడిపోయారు. ఈ ప్రమాదంలో ఆయన ఎడమ కాలు, తల వెనుకభాగంలో తీవ్ర గాయాలయ్యాయి. అలాగే ద్విచక్రవాహనంపై వచ్చి ఢీకొట్టిన వ్యక్తి ధర్మాన చరణ్‌తేజకు కూడా గాయాలయ్యాయి. ఈమేరకు వారిద్దరినీ 108 వాహనంలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులు కేసును నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

గరుగుబిల్లి: తోటపల్లి కుడిప్రధానకాలువ పరిధిలోని చినగుడబ గ్రామ రెవెన్యూ పరిధిలో గల ముదిలి దుర్గాప్రసాద్ తోటలో ఓ వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు స్థానిక వీఆర్‌ఓ జోజి గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి చనిపోయిన వ్యక్తి జేబులో ఉన్న ఆధార్ కార్డు ద్వారా పేరు సిరాకుమార్ తస్యప్ (జగదల్‌పూర్)(30)గా నిర్ధారించారు. ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై ఎం.రాజేష్ తెలిపారు.


ఆత్మహత్యకు పాల్పడిన సిరా కుమార్ తస్యప్

# 510 ఆర్‌బీకేల్లో ధాన్యం కొనుగోలు

- వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకుడు త్రినాథ స్వామి


విలేకరులతో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకుడు త్రినాథస్వామి

వేపాడ: జిల్లాలో 510 రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేపట్టినట్లు వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకుడు త్రినాథ స్వామి తెలిపారు. జేసీ ఆదేశాల మేరకు మంగళవారం ఆయన వేపాడ మండలంలో ధాన్యం కొనుగోలు పరిశీలనకు వచ్చిన సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో రెండు లక్షల అరవైనాలుగు వేల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటికే లక్షా ఏభై వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. ఎఫ్‌టీఓ జనరేట్ అయిన పదిరోజుల్లో పేమెంట్ రైతు ఖాతాల్లో జమ అవుతోందని తెలిపారు. ఇప్పటికే చాలామంది రైతుల ఖాతాల్లో నగదు జమ అయినట్లు తెలిపారు. ఈ ఏడాది పంటలు సమృద్ధిగా పండడంతో కొనుగోలు లక్ష్యం పెరిగే అవకాశమున్నందున అదనపు కొనుగోలుకు ప్రతిపాదనలు చేస్తున్నట్లు చెప్పారు. రబీలో అపరాలు సాగులో ఉన్నందున పంటలో బూడిద తెగులు, కాయతొలుచు పురుగు నివారణకు సంబంధిత వీఏఏలను రైతులు సంప్రదించి నివారణ మందులు పిచికారీ చేయాలని సూచించామన్నారు. అనంతరం బానాది ఆర్‌బీకేనీ సందర్శించారు. ధాన్యం నిల్వలు పెరిగిపోతున్నాయని ట్రాన్స్‌పోర్టు సౌకర్యం కల్పించాలని బానాది సర్పంచ్ కర్రి యశోద జేడీ దృష్టికి తీసుకువెళ్లడంతో తక్షణమే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సీబీ యశ్వంతరావు, సీఎస్‌డీటీ రామకృష్ణ వల్లంపూడి ఉపసర్పంచ్ రుద్ర వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

### ముగ్గురు పేకాటరాయుళ్ల అరెస్టు

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి గాయత్రి కాలనీ సమీపంలోని పొలాల్లో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను మంగళవారం అరెస్టు చేశామని ఎస్సై వీబీ రామకృష్ణ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడిచేసి పట్టుకుని వారి నుంచి రూ.13,220 స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేశామన్నారు.